# ఉగాదినాడూ మామూలు కథే!

కొప్పమీది కోడి తుళ్ళిపడి లేచింది.

"......కీ ఉగాది శుభాకాంక్షలు" అంటున్నారెవరో.

"నిద్దట్లో మాట్లాడేస్తున్నావేవిఁటి చెప్మా" అనుకొని ఒక్కసారి రెక్కలువిదిలించగానే, మత్తు వదిలింది. అన్నట్టు ఈవేళ ఉగాది కదూ. తనకి శలవు "థేంక్యూ, ఆకాశవాణి" అనుకొని మళ్ళీ పడుకొంది.

లేచిన రెండు నిమిషాల్లో మళ్ళీ నిద్రపోవడానికి నేనేం కోడినికాను, పైగా నాకివాళ శలవూ లేదు. నాకంటె అదే నయం. దానికి ఉగాదినాడైనా రిటైరుమెంటు లేదు, అల్లప్పుడెప్పుడో అమ్మమ్మ తోడు వుంటే నెలకి మూడు రోజుల శలవు. మోడర్నయిపోయి మంటకలిపేసుకున్నాం మరింక సీయస్ అయిపోతే తప్ప సిక్ లీవు కూడా లేదు. పాకిరో, డేకిరో చాకిరీ చెయ్యాల్సిందే. ఏం చేస్తే ఏం లాభం?

మెప్పా? మేకతోలా?

"మెప్పుకోసవేఁ అయితే మేకతోలేం ఖర్మ, ఏనుగు తోలే కప్పుతాను గాని, ఈ గిన్నెలో పదార్థం పేరేవిఁటి?" అన్నారు మావారు చెమ్చాతో కలుపుతూ,

తెలీక్కాదు. అదో సరసం:

"ఉగాది పచ్చడి నాన్నా. ఇంకా వేప పువ్వు వెయ్యలేదు" అంది మా రెండోది.

"మీ అమ్మ చేస్తే వేరే వేపపువ్వు ఎందుకు? ఆవిడేం చేసినా వేప రుచే. వేప చెట్టులాంటిది... అమ్మడూ మొత్తానికి మా గొప్ప కూతుర్ని కన్నాడు మీ నాన్న..."

ఇదే డైలాగు మానాన్నా అన్నారు. మీ అల్లుడూ అంటాడు. మొగాళ్ళలో తేడా వుంటుందేమో కాని మొగుళ్లు మాత్రం అంతా ఒకటే.

"చచ్చి స్వర్గాన వున్నారు ఆయన వూసెందుకు?" సాగదీశాను.

"బొజ్జాయ్! మీ తాత దగ్గర్నుంచి ఉత్తరం వచ్చిందా: " ఆ నవ్వు చూస్తే నాలుగు తగల్నివ్వాలనిపిస్తుంది ఎంత సీత, సావిత్రికైనా.

చిన్నది తెల్లబోయింది.

"ఏం లేదు. స్వర్గంలో వున్నాడని – అని, అంత ధీమాగా చెప్తోంది. ఒకవేళ ఉత్తరం రాశేడేమోనని..."

కుళ్ళు జోకు:

"మంకీ బ్రాండ్ పళ్ళపొడి ఈమధ్య మార్చేడా అనుకున్నాను. ఉగాది పచ్చడా? సే సో!"... అటూ చెమ్చాతో నోట్లో వేసుకున్నారు.

"అదెలావున్నా మీరు మాత్రం ఆ పళ్ళపొడి ఎడ్వర్‌టైజ్ మెంటులా వున్నారు" అనబోయి నాలిక చివరే ఆపేశాను.

పండగపూటా...ఓపికుంటే తలంటి నీళ్ళు పోసుకుంటారు లేకపోతే మానేస్తారుకాని కాపరంలో నీళ్ళుపోసుకోరు.

"ఉగాది పచ్చడి కూడా చెయ్యడం రాని ఆడదాన్ని ఏం చెయ్యాల్రా కరుణ్?" మా పెద్దవాడ్ని అడిగారు.

"మొగాళ్ళచేత చేయించుకోవాలి" అంది మా పెద్దది. నోట్లో పెట్టుకున్న అన్నం మింగడానిక్కూడా బద్ధకం దానికి.

"హేంగింగ్ యిచ్చేద్దురూ హాయిగా ఉంటుంది"

"అంత శిక్షెందుక్కాని యావజ్జీవంచాలు."

ఇప్పుడు నేను చేస్తున్నది అదే.

"అన్నట్టు ఇవేళ సంవత్సరాదికదూ..."

నయం. నువ్వు నా పెళ్ళానివేనా అన్లేదు.

"అంచేత మనందరం న్యూ ఇయర్ రిజల్యూషన్సు చేసుకుంటే బావుంటుంది. మీ అమ్మ సంగతి వదిలేయండి ఏ ముహూర్తాన పుట్టిందోకాని ఆవిడకి "మంచి" అంటే గిట్టదు"

పిల్లలంతా ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. తరవాత నా మొహంలోకి చూసి "తల్లి తల్లి. యీ గండం గడిపే బాధ్యత నీదే" అన్నట్టు కళ్ళతోనే దణ్ణాలు పెట్టేరు.

"వాళ్ళతో ఏఁవిఁటి? గుంట వెధవలు. పోనిస్తురూ?" అన్నాను అసందర్భం అని తెలిసినా.

"కృష్ణమూర్తి కూతురా? బాలా త్రిపురసుందరా? నువ్వు పండుగనాడైనా నోరు మూసుకో. వాళ్ళేం చిన్నపిల్లలు కారు. చెప్పడానికి భాష, మాట్లాడ్డానికి నోరూ వున్నాయి. నువ్వు వకాల్తా పుచ్చుకోకు జిల్లా జడ్జీచేసి రిటైరైన్నాటికైనా మీ నాన్నకి వకాల్తనామా రాయడం రాలేదు..."

"మానెయ్యమని చెప్పను గాని సిగరెట్లు కొంచెం తగ్గించు నాన్నా. ఈ వయసులో అన్ని సిగరెట్లు మంచిదికాదు." రంగంలోకి దిగేసింది చిన్నది.

అదే మాట ఇంకెవరైనా అని వుంటే పండుగ పూటా మా ఇంట్లో ఓ హత్య జరిగివుండేది.

"నన్ను ఇంగ్లీషు సినీమాలకి రమ్మనొద్దు" అన్నాన్నేను.

"నువ్వు అంత రేష్ డ్రైవింగ్ కూడా మానాలి నాన్నా" సలహా యిచ్చేడు పెద్దవాడు.

"అన్నింటికంటె నువ్వు కొంచెం కోపం తగ్గించుకోవాలి" చిన్నవాడు గొణిగేడు.

ఆఖరి వాక్యం ఎక్కడ తగలకూడదో అక్కడే తగిలింది.

"కప్ప కరిచిందని నాక్కోపవేఁవిఁటయ్యా? ఇదిగో మీ అమ్మే చేస్తోంది యీ ప్రోపగాండా అంతాను. అస్తమానూ మీ నాన్నకి కోపం అంటూను తనేదో శాంతాదేవి అయినట్టు. నేను వైను తాగిన విశ్వామిత్రుడినైనట్టు... యు ఆర్ పోయిజనింగ్ ది ఛిల్డ్రన్... ఆడది మొగుడ్ని గౌరవిస్తే, పిల్లలు తండ్రిని గౌరవిస్తారు. లేకపోతే యిదిగో "ఓ తృణమా" అన్న భావం తప్ప యింకేవిటి?... అందరూ కంటారు పిల్లల్ని. కొంతమందే పెంచుతారు..."

నా కళ్ళలో భావం అర్థం చేసుకున్న పిల్లలు లేచి వెళ్ళిపోయేరు.

"నువ్వెందుకూ. పోయి వండుకో, మళ్ళీ సంవత్సరాదినాడు నా మొగుడు తిట్టేడోయ్ అని అభాండం నా కెందుకు? ఛీ... ఛీ... ఎంత శాంతంగా వుందామన్నా వుండనివ్వరు. బుద్ధిక్కూడా బుర్ర వేడెక్కిపోతుంది... ఇది ఇల్లా? ..." ఇంక ఆ ప్రవాహం ఆగదు.

సంవత్సరాని కొక్క రోజైనా మనిద్దరం దెబ్బలాడుకోవడం మానేద్దాం అన్న రిజల్యూషను తీసుకుంటే బావుండును అన్న కోరిక కోరికగానే మిగిలిపోయింది.

*('ఆంధ్రజ్యోతి' దినపత్రిక 8-4-1978.)*

★ ★ ★